
టీచర్లకు సర్దుపాట్లు



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సర్దుబాటు బెంగ పట్టుకుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైంది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు కొరత తీర్చేందుకంటూ ఉపాధ్యాయుల సర్దుబాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేపట్టింది. విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాట్లు చేయడంపై, ఆ పేరుతో ఎక్కడికో బదిలీలు చేయనుండటంపై పలువురు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారుతోంది. సర్కారు బడుల్లో ఈ ఏడాది తగ్గిన విద్యార్థుల సంఖ్య ఉపాధ్యాయులకు జెలక్ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు సర్దుబాటు బదిలీలపై ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో ఆందోళన రేపుతోంది. ఈ హైస్కూల్‌లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఇక్కడి టీచర్లలో కొందరికి సర్దుబాటు బదిలీలు తప్పేటట్లు లేదు. దీంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

1,529 మంది విద్యార్థులు..

తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఇంతవరకు 304 మంది మాత్రమే 6 నుంచి 10వ తరగతి వరకు కొత్తగా చేరారు. గతేడాది(2023–24)లో సుమారు 450 మంది కొత్త విద్యార్థులు చేరడంతో సుమారు 1,800 మంది వరకు విద్యార్థులుండేవారు. 2023–24లో పదో తరగతి నుంచి 427 మంది విద్యార్థులు రిలీవ్ అయ్యారు. ఇంకొందరు వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేరిన వారు ఈ పాఠశాల నుంచి టీసీలు తీసుకున్నారు. కొత్తగా చేరిన వారితో కలసి ప్రస్తుతం 1,529 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. దీని పరిధిలో 15 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో ఈ ఏడాది సుమారు 400 మంది ఐదో తరగతి నుంచి రిలీవయ్యారు. వారంతా అందుబాటులో ఉండే తోటగరువు హైస్కూల్‌లోనే చేరాల్సి ఉంది. ఇక్కడ ఆరో తరగతిలో ఇంతవరకు సుమారు 170 మంది మాత్రమే చేరడం విశేషం. మిగిలిన వారంతా అందుబాటులో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేరిపోయారు.

ఉపాధ్యాయుల్లో ఆందోళన..

ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరిని ఎక్కడికి సర్దుబాటులో భాగంగా బదిలీపై పంపించేస్తారో తెలియని పరిస్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల సంఖ్యను బట్టి ఇక్కడ అవసరమైన ఉపాధ్యాయులను నియమించారు. ఇప్పుడీ పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో అవసరం కంటే టీచర్ల సంఖ్య ఎక్కువైంది. ఇక్కడ గతేడాది వరకు 1800కు పైగా విద్యార్థులు ఉండటంతో వారి అవసరాన్ని బట్టి సబ్జెక్టుల వారీగా 57 మంది ఉపాధ్యాయులు(హెచ్‌ఎం, పీఈటీలతో సహా) ఉన్నారు.

ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 1,529కి పడిపోయింది. ఈ సంఖ్యను బట్టి ఇక్కడ హెచ్‌ఎం, పీఈటీలతో కలిపి సుమారు 42 నుంచి 45 మంది ఉపాధ్యాయులు ఉంటే సరిపోతుందని భావిస్తున్నారు. మిగిలిన సుమారు 12 నుంచి 15 మంది ఉపాధ్యాయులకు సర్దుబాటు బదిలీ తప్పదని అంటున్నారు. నిబంధనల ప్రకారం సర్వీస్‌ను బట్టి జూనియర్లకే ఈ బదిలీ ఉంటుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఎక్కడ ఖాళీ ఉంటుందో.. ఏ మూలకు వెళ్లాల్సి వస్తుందోనని ఇక్కడి ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అందరికీ 'తల్లికి వందనం' ఇస్తామనడమేనా..

ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పథకం పేరుతో ఏడాదికి రూ.15,000 చొప్పున ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చెప్పిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక పిల్లలందరికీ ప్రభుత్వం తల్లికి వందనం ఇస్తుందనే ఆశతో చదివించుకోవచ్చని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నారని ప్రభుత్వ ఉపాధ్యాయులు భావిస్తున్నారు. దీనివల్ల రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాలలకు మరింత ఇబ్బందిగా మారే పరిస్థితి ఉందని అంటున్నారు.

ఏయూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న చీఫ్ లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని గ్రంథాలయంలో వసతులు, వనరులను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏయూ డాక్టర్ వి.ఎస్.గ్రంథాలయం చీఫ్ లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ గ్రంథాలయంలో 5 లక్షలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు నిరంతరం చేరవయ్యేలా డిజిటల్ రూపంలో కూడా పుస్తకాలు, జర్నల్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ గ్రంథాలయం ఎందరో విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కేంద్ర ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో నిలిచే స్థాయికి తీర్చిదిద్దిందని గుర్తుచేశారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నమెంట్



ట్రోఫీలతో డీవైఎఫ్‌ఐ వాలీబాల్ టోర్నీ విజేతలు

ఆరిలోవ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆరిలోవలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో 20 జట్లు తలపడ్డాయి. ముత్యమాంబ యూత్ జట్టు ప్రథమ స్థానంలో, వైజాగ్ శ్రీను జట్టు రెండో స్థానం, ముత్యమాంబ జూనియర్ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. టోర్నీని ప్రారంభించిన ముఖ్య అతిథి ఆరిలోవ సీఐ జి.గోవిందరావు మాట్లాడుతూ యువత కోసం ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడువ్యసనాలకు వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో ముందుండాలన్నారు. భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి యోధులు యువతరంలోనే దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. వారి ఆశయ సాధనకు డీవైఎఫ్‌ఐ కృషి చేస్తోందని చెప్పారు. యువతకు నిరంతరం సహకారం అందిస్తామన్నారు. అనంతరం విజేత జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మాజీ నాయకుడు పి.శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్, ముఖేష్ రాజా, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏయూ వీసీని కలిసిన ఎస్‌ఈబీ ఏడీఎస్పీ



వీసీ శశిభూషణరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏడీఎస్పీ గంగాధరరావు

విశాఖ సిటీ: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డి.గంగాధరరావు సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య జి.శశిభూషణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణా కాలేజీలో డిగ్రీ ప్రవేశాల జాబితా విడుదల

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి అర్హుల జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు ఈ నెల 16వ తేదీలోగా అలాట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య బృందం ఉదయం 9 గంటల నుంచి వైద్య సేవలు అందిస్తుందని, బీపీ, సుగర్‌తోపాటు ఇతర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని స్థానికులు వినియోగించుకోవాలని కోరారు.

ఆ భవనం కూలిపోలేదు.. కూలగొడుతున్నారు



దాబాగార్డెన్స్‌లో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూలుస్తున్న కార్మికులు

దాబాగార్డెన్స్: దాబాగార్డెన్స్‌లోని హిరావత్ షోరూం పక్కన శిథిలావస్థలో ఉన్న ఓ భవనం ఉన్నట్టుండి కూలిపోయిందని రూమర్ షికార్లు చేసింది. వాస్తవానికి ఆ బిల్డింగ్ యజమాని శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసి నిర్మాణాలు చేపట్టడానికి కొద్ది రోజులుగా సిబ్బందిచే పనులు చేయిస్తున్నాడు. 2008లో బిల్డింగ్ నిర్మాణం కూలిన సందర్భంలో ఇద్దరు మృతి చెందారు. అప్పటి నుంచి ఈ బిల్డింగ్ నిర్మాణం కొన్ని కారణాల వల్ల జరగలేదు. ఇటీవల ఈ భవన నిర్మాణానికి సంబంధించి యజమాని నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సిబ్బంది కూలుస్తున్న సమయంలో పిల్లర్లు ఒక్కసారిగా నేలకొరిగాయి. ఈ ఘటనపై పలువురు పుట్టించిన పుకార్లు.. షికార్లు చేశాయి.

సాగర్‌నగర్‌లో పాము కలకలం



స్థానికుల చేతిలో హతమైన పాము

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో సోమవారం 7 అడుగుల నాగు పాము కలకలం రేపింది. సాయంత్రం సమయంలో సాగర్‌నగర్ సమీపంలోని సచివాలయం వెనుక రోడ్డుపై పాము వెళ్లడాన్ని స్థానికులు చూశారు. భయభ్రాంతులకు గురైన వీరు యువకుల సహాయంతో దీనిని హతమార్చారు. ఇదంతా కొండప్రాంతం కావడం, ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో తరచూ పాములు వస్తుంటాయని స్థానికులు తెలిపారు.

ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీ



ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవంలో డీన్ విజయ్‌మోహన్, విద్యార్థులు

విశాఖ సిటీ: ర్యాగింగ్ రహితంగా ఆంధ్రా యూనివర్సిటీని నిలపాలని విద్యార్థులకు ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పిలుపునిచ్చారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్ రహిత క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ కారణంగా యువత జీవితం నాశనమవుతోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం, ప్రోత్సహించడం సరికాదని, విద్యార్థుల మధ్య స్నేహభావం, సత్సంబంధాలు ఎంతో అవసరమని సూచించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే విద్యార్థి వ్యవహారాల కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. నిరంతరం విద్యార్థులకు ఆచార్యులు, సిబ్బంది అవసరమైన సహకారాన్ని అందిస్తారని చెప్పారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య విజయ్‌మోహన్ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని సూచించారు. యువతరం విలువైన మానవ, మేధో వనరులుగా నిలవాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య ఎన్.ఎం.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.ఆర్.రంగనాథన్‌కు ఘన నివాళి



ఎంవీపీ కాలనీ గ్రంథాలయంలో ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



కృష్ణా డిగ్రీ కళాశాలలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విజయబాబు తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ శాఖా గ్రంథాలయంలో సోమవారం ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరావు, పలువురు సచివాలయ కార్యదర్శులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమం ద్వారా దేశంలో లైబ్రరీల ఏర్పాటుకు రంగనాథన్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో గ్రంథాలయాలు పోషించిన పాత్ర వెలకట్టలేనివని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పత్రికల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున చైతన్యవంతులై ఉద్యమంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు ప్రత్యూష, జక్కమ్మ, వార్డు హెల్త్ సెక్రటరీ సుభాషిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిజ్ఞ

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సోమవారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా డ్రగ్‌ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మధురవాడకు చెందిన గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా తాము కూడా డ్రగ్స్ రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. దీని కోసం శక్తి మేరకు చేయగలిగిందంతా చేస్తామని ప్రతిన బూనారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఉమారాజ్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగనంపూడి ఇసుక డిపోను తనిఖీ చేసిన కలెక్టర్



కొనుగోలుదారులను ఆరా తీస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అగనంపూడి(గాజువాక): అగనంపూడిలోని ఇసుక డిపోను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక డిపోలో నిల్వలు, అమ్మకాల తీరు, రవాణా చార్జీల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంత వరకు అమ్మకాలు సాగాయి, ఏమేరకు నిల్వలు ఉన్నాయో రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇసుక కోసం వచ్చిన కొనుగోలు దారులు, ట్రాన్స్‌పోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఇసుక అందించడంలో సిబ్బంది నుంచి సహకారం ఉందా , ఇబ్బందులు ఏమైనా ఉన్నా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాజువాక మండల రెవెన్యూ సిబ్బందితోపాటు గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్కే బీచ్‌లో సీపీ అర్ధరాత్రి తనిఖీలు

- విద్యుత్ లైట్లు లేని ప్రాంతాల్లో పరిశీలన
- అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



బీచ్ రోడ్డులో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు విచ్చలావిడిగా సాగుతున్నాయని ఈ నెల 7న 'సాగరతీరం.. అంధకారం' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్పందిస్తూ ఆదివారం అర్ధరాత్రి ఆర్కే బీచ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అయిన వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్, ఆర్కే బీచ్ ప్రాంతాల్లో పరిశీలించారు. అనంతరం మీడియాతో సీపీ మాట్లాడుతూ రాత్రి పూట శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో వీధిలైట్లు లేకుండా ఉన్న ప్రాంతంలో జీవీఎంసీ ద్వారా వాటిని ఏర్పాటు చేయిస్తామన్నారు. నగరంలోని దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. శిశు మరణాల మీద ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. రాత్రి పూట గస్తీ పెంచామని, చెక్ పోస్టులు, బ్లూ కోట్ టీమ్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతోందన్నారు. ఎవరు ఏ నేరం చేసినా కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

'మైనారిటీ సమితి' ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ గౌస్



నియామక పత్రాన్ని అందుకుంటున్న గౌస్

బీచ్ రోడ్డు: విశాఖ జిల్లా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా 21వ వార్డుకు చెందిన సంఘ సేవకుడు మహ్మద్ గౌస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ ఫారుఖ్ షుబ్లీ విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫారుఖ్ మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. మైనారిటీల సంక్షేమం, పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. మహ్మద్ గౌస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గౌరవప్రదమైన పదవిని కేటాయించడం అదృష్టమన్నారు. ముస్లిం మత పెద్దలకు, జిల్లా అధ్యక్షుడు అస్లంఖాన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

10 వేల మందితో త్రివర్ణ పతాక ర్యాలీ రేపు

దాబాగార్డెన్స్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం వైఎస్సార్ సెంట్రల్ పార్క్‌లో 10 వేల మంది విద్యార్థులతో.. 25వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి సేవ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి కోరారు. గొల్ల ప్రదీప్‌రాజు, కర్రి నరేష్, ఇషాక్ మహ్మద్, పీవీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పలక పడి వ్యక్తి మృతి



రాము (ఫైల్)

గోపాలపట్నం: జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్‌లో గల గ్రానైట్ పలకల దుకాణంలో లోడింగ్ చేస్తుండగా ప్రమాద వశాత్తు పలక పడి రోకల రాము అనే కలాసి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎండాడ పరిధి శాంతినగర్‌కు చెందిన రోకల రాము(39) కొంత మంది కలాసీలతో పలకలు లోడింగ్ చేస్తుండగా ఒక పలక ప్రమాదవశాత్తు రాము తలపై పడింది. దీంతో తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు వివరాలు సేకరించారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించేందుకు యత్నిస్తుండగా బంధువులు, కలాసీలు అడ్డుకున్నారు. రాము కుటుంబానికి తగిన నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడు రాముకు భార్య రామసూరి, ఇద్దరు కుమారులు ఉండగా చిన్న కుమారుడు ప్రసాద్ మూడేళ్లకిందట బీచ్‌లో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఇప్పుడు ఇంటికి పెద్ద దిక్కైన రాము మృతి చెందడంతో ఆ కుటుబంలో విషాదం నెలకొంది. ఎట్టకేలకు ఆందోళన విరమించడంతో రాత్రికి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

మోడలింగ్‌లో మెరిసిన రిషిక



రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకున్న తన్వీ రిషిక

దాబాగార్డెన్స్: థాయిలాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో నగరానికి చెందిన తన్వీ రిషిక విశేష ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచింది. వివిధ దేశాల విజేతల మధ్య జరిగిన హోరాహోరీ పోటీల్లో ప్రి టీన్ కేటగిరీలో నగరానికి చెందిన తన్వీ రిషిక రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. కాస్ట్యూమ్స్ విభాగంలో బెస్ట్ రిప్రజంటేషన్ ఫ్రమ్ ఇండియా, సూపర్ టాలెంట్ ఆఫ్ సీజన్ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా తన్వీ రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గుర్తించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. తన్వీ తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ రంగంలో జారీ ఎత్నిక్ వేర్, సూర్యప్రభ నందిని, రోహిత్, అరుణ్‌రతన్, నరేస్ మాస్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య విద్యార్థుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎంసీ వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కోల్‌కతాలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన ఘాతుకానికి నిరసనగా సోమవారం వైద్య విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూడో వైద్యుల ఆధ్వర్యంలో ఏఎంసీ నుంచి కేజీహెచ్ వరకు వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.పృథ్వీరాజ్, కార్యదర్శి డాక్టర్ వై.రాజ్ వివేక్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఒ.రాపేటీ తదితరులు పాల్గొన్నారు.